సాక్షి ఒడిశా

శనివారం । 15 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.6,59,075
బంగారం	2 గ్రాముల 330 మిల్లీ గ్రాములు
వెండి	28 గ్రాముల 810 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

ఆనందోత్సాహాలతో 'రొజ్జొ'

మూడు రోజుల రొజ్జొ పండుగ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచి ఆరంభమైంది.

- 8లో▸





రక్తదానంతో ప్రాణదానం

రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు.

- 8లో▸

న్యూస్‌రీల్

అసెంబ్లీలో అసలైన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఉంటుంది

- జయపూర్ ఎమ్మెల్యే బాహిణీపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

కొరాపుట్: రాష్ట్ర అసెంబ్లీలో అసలైన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని ఆ పార్టీకి చెందిన జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. శుక్రవారం సాయంత్రం భువనేశ్వర్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో ప్రసంగించారు. తాను కాంగ్రెస్ శాసన సభాపక్ష నేతగా ఉన్నా, లేకపోయినా పర్వాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన 14 మంది సభ్యులు ఒక్కటేనని స్పష్టం చేశారు. తమలో వర్గ విభేదాలు లేవని పేర్కొన్నారు. ప్రస్తుతం బీజేడీ పార్టీకి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోరువిప్పే దమ్ము లేదన్నారు. వారికి సీబీఐ, ఈడీ భయాలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. అందుకే వారు ప్రధాన ప్రతిపక్ష పాత్రలో విఫలం అవుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మాత్రం బీజేపీ ప్రజా వ్యతిరేక పనులు చేస్తే వదిలిపెట్టదన్నారు.

మంత్రి నిత్యానంద గొండో పర్యటన నేడు



మంత్రి నిత్యానంద గొండోకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

కొరాపుట్: రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నిత్యానంద గొండో శనివారం సొంత జిల్లాకు రానున్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం అందుకు తగిన వివరాలు ప్రకటించింది. నిత్యానంద అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి ఒక్కరే మంత్రి పదవి దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మంత్రి పర్యటనకి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం మంత్రి కాన్వాయ్ రాజధాని నుంచి బయల్దేరిన తర్వాత జట్నీ వద్ద స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం రాత్రి కొరాపుట్ జిల్లా కేంద్రం చేరుకున్నారు. శనివారం ఉదయం కొరాపుట్ జిల్లా అధికార యంత్రాంగం, ప్రజలతో సంభాషిస్తారు. ఉదయం 10 గంటలకు జయపూర్, 10.30కి బొరిగుమ్మ, 11 గంటలకు పర్లి వద్ద కార్యకర్తలు స్వాగతం పలుకుతారు. 11.30కి కొరాపుట్-నబరంగ్‌పూర్ జిల్లాలను విడదీసే ఇంద్రావతి నది వద్ద నుంచి భారీ మోటారు సైకిళ్ల ర్యాలీ జరుగుతుంది. మధ్యాహ్నం 1 గంటకి సర్క్యూట్ హౌస్ వద్ద జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో సమావేశమవుతున్నారు. 3.30కి పపడాహండి వద్ద స్వాతంత్ర్య సమరయోధుల అమర స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. సాయంత్రం 4 గంటలకు డాబుగాం, 5 గంటలకు సొంత నియోజకవర్గం ఉమ్మర్‌కోట్ లో పర్యటించి రాత్రికి బల్లుగుడలో స్వస్థలంకి చేరుకుంటారు. ఆయనతో పాటు నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ఉన్నారు.

పిడుగుపడి యువకుడికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మనోజ్

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి ధమునిపొంగ పంచాయతీలోని ఒకాబడి గ్రామానికి చెందిన మనోజ్ కొరాకొరియా అనే యువకుడిపై పిడుగు పడడంతో తీవ్రగాయాలకు గురయ్యాడు. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి అందిన సమాచారం మేరకు సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న మనోజ్, కొద్దిపాటి వర్షం కురవడంతో తడిచిపోతానని భావించి సమీపంలోని మర్రిచెట్టు కింద నిల్చున్నాడు. అదే సమయంలో ఉరుములతో కూడిన వర్షంతో పాటు చెట్టుపై పిడుగు పడడంతో అదే చెట్టుకింద నిల్చున్న మనోజ్ తీవ్రగాయాలకు గురయ్యాడు. సమీపంలోని వారు అతనిని వెంటనే కల్యాణ సింగుపూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలియజేశారు.

నిరుపయోగంగా ఆవాస్ గృహాలు

- కొందరికే కేటాయించడంతో ఇళ్లకు వెళ్లని లబ్ధిదారులు
- అందరికీ కేటాయించాలని వేడుకోలు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం

రాయగడ: సదరు సమితి పరిధి హలువ పంచాయతీ బైరాగి హలువ గ్రామంలో మూడేళ్ల క్రితం నిర్మించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహాలు నిరుపయోగంగా మారుతున్నాయి. లబ్ధిదారులు సంబంధిత కార్యాలయాలు చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే గానీ కొన్నిచోట్లు ఈ గృహాలు దక్కవు. కానీ ఈ గ్రామంలో మాత్రం లబ్ధిదారుల కోసం కేటాయించి నిర్మించిన గృహాలకు ఎవ్వరూ వెళ్లడం లేదు. దీంతో నిర్మితమైన ఏడు గృహాలు దాదాపు శిథిలావస్థకు చేరుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. బైరాగి హలువ గ్రామం కొండ దిగువున ఉండడంతో ఇక్కడ నివసిస్తున్న 28 కుటుంబాలకు చెందిన ప్రజలు తమ గ్రామంలో మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నామని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన జిల్లా యంత్రాంగం 2020–21 ఆర్థిక సంవత్సరంలో బైరాగి హలువ గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఏడు గృహాలను నిర్మించింది. అదేవిధంగా ఇక్కడ నివసించే వారికి తాగునీటి సౌకర్యార్థం ఒక గొట్టపుబావి, అదేవిధంగా రహదారి, మరుగుదొడ్లను నిర్మించారు. కానీ లబ్ధిదారులు ఆవాస్ గృహాలకు వెళ్లకుండా వారి గ్రామంలోనే ఉంటున్నారు.

ఒకేచోట కేటాయించాలని...

జిల్లా యంత్రాంగం తమ గ్రామంలోని 28 కుటుంబాలకు చెందిన వారందరికీ ఒకేసారి ఆవాస్ గృహాలు నిర్మించి ఇస్తేనే అక్కడి వెళ్తామని గ్రామస్తులు పట్టుబడుతున్నారు. కేవలం ఏడు గృహాలు మాత్రమే కేటాయించడంతో మిగతావారిని వదిలి వెళ్లమని, గ్రామంలోనే ఉంటామని స్పష్టం చేస్తున్నారు. దీంతో నిర్మితమైన కొన్ని ఆవాస్ గృహాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గొట్టపుబావి నిరుపయోగంగా పడి ఉన్నాయి.



శిథిలమైన మరుగుదొడ్డి



నిరుపయోగంగా ఉన్న ఆవాస్ గృహం



బైరాగి హలువ గ్రామం



తాగునీటి కోసం ఏర్పాటు చేసిన గొట్టపుబావి

కొందరికే కేటాయించడం విచారకరం



ఎంతో అన్యోన్యంగా కలిసిమెలసి ఉంటున్న గ్రామంలో ఇలా కొందరికే ఆవాస్ గృహాలు కేటాయించడం, మరి కొందరికి కేటాయించకపోవడం విచారకరం. గ్రామంలో సుమారు 28 కుటుంబాలు నివసిస్తున్నాం. అంతా పేదరికంతో ఉండేవాళ్లమే. అటువంటప్పుడు కొందరికి ఆవాస్ గృహాలు కేటాయించడం, మరికొందరికి కేటాయించకపోవడంతో అందరం ఒకేచోట ఉండాలని నిర్ణయించుకున్నాం. అందుకే ఆవాస్ గృహాలకు అర్హులుగా గుర్తించిన వారు కూడా గ్రామం విడిచి వెళ్లలేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. అధికారులు మౌలిక సౌకర్యాలతో అందరికీ ఇళ్లను కేటాయిస్తే అక్కడకు వెళ్లి ఉంటాం.

– పి.శాంతి, బైరాగి హలువ

గ్రామంలో అందరికీ కేటాయించాలి



ఐదేళ్ల క్రితం తమ గ్రామంలో వారందరికీ ఆవాస్ గృహాలు కేటాయించాలని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాం. 2020–21వ ఆర్థిక సంవత్సరంలో బైరాగి హలువకు కొద్ది దూరంలో పూర్తి అటవీ ప్రాంతంలో గ్రామంలోని 7గురు లబ్ధిదారులకు గృహాలు కేటాయించి నిర్మించారు. అయితే అంతా కలిసి నివసిస్తున్న గ్రామంలో ఇలా వేరువేరుగా విడిపోవడం ఇష్టంలేక, అవాస్ గృహాలు కేటాయించిన లబ్ధిదారులు కూడా అక్కడికి వెళ్లేందుకు ఇష్టపడలేదు. అందువల్ల అందరికీ ఒకేసారి కేటాయించడంతో పాటు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాం.

– పి.చంద్రశేఖర్‌రావు, బైరాగి హలువ

ఒకే దగ్గర అవకాశమివ్వాలి



బైరాగి హలువలో నివసిస్తున్న మా అందరికీ ఒకే దగ్గర ఇళ్లను నిర్మించుకునే అవకాశం కల్పించాలి. కొందరు అక్కడ, మరి కొందరు వేరేచోట ఉంటే మాలో ఐకమత్యం పోతుంది. అందువల్ల అందరికీ ఒకేసారి, ఒకేచోట ఆవాస్ గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరాం. మా ప్రతిపాదనను ప్రభుత్వం పట్టించుకోలేదు. అందుకే ఆవాస్ గృహాలు కొందరికి నిర్మించినా అక్కడికి వెళ్లలేదు.

– పొలాపు గౌరి, బైరాగి హలువ గ్రామస్తురాలు

యంత్రాగం చర్యలు తీసుకోవాలి



ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలి. అడవుల్లో ఇళ్లను నిర్మించి కొంతమందికి మాత్రమే వాటిని కేటాయిస్తే వారు అక్కడ ఉండగలరా. అందువల్ల అందరికీ ఇళ్లను కేటాయిస్తేనే అందరం అక్కడికి వెళ్తాం. లేదంటే ఇక్కడే కష్టనష్టాలు పడి ఉంటాం.

– కె.వెంకటరావు, బైరాగి హలువ

ప్రొటెం స్పీకర్‌గా రణేంద్ర ప్రతాప్

- ఈనెల 20న కొత్త స్పీకర్ ఎన్నిక



ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న రణేంద్ర ప్రతాప్ స్వంయి



ప్రొటెం స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన రణేంద్ర ప్రతాప్ స్వంయి

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా కటక్ జిల్లా అఠొగొడొ నియోజకవర్గం ఎమ్మెల్యే రణేంద్ర ప్రతాప్ స్వంయి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్ అభిషేక్ హాల్‌లో జరిగిన సాధారణ కార్యక్రమంలో గవర్నర్ రఘుబర్ దాస్ ఆయనతో ప్రమాణం చేయించారు. రణేంద్ర ప్రతాప్ స్వంయి ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీనియర్ సభ్యుడు కావడంతో ఆయనను ప్రొటెం స్పీకర్‌గా గవర్నర్ నియమించారు. ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఆయన మంత్రి మండలి సభ్యులు, ఇతర శాసనసభ్యులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారోత్సవం ముగిసిన వెంటనే ప్రొటెం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ ఈనెల 18, 19 తేదీల్లో సభలోని ఇతర శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని, జూన్ 20న స్పీకర్ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. ప్రొటెం స్పీకర్ పరిమిత కాల వ్యవధిలో నియమించబడిన తాత్కాలిక స్పీకర్. పార్లమెంట్ లేదా రాష్ట్ర శాసనసభల్లో కొత్త స్పీకర్ ఎన్నికయ్యి ప్రమాణ స్వీకారం చేసేంత వరకు కార్యకలాపాలను ప్రొటెం స్పీకర్ నిర్వహిస్తారు. శాశ్వత స్పీకర్ ప్రమాణ స్వీకారంతో ఈ పదవీకాలం ముగుస్తుంది.

17వ ముఖ్యమంత్రిగా మోహన్ మఝి

జయపురం: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో మోహన్ చరణ్ మఝి 17వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఒడిశాలో రెండు ఎన్నికలు జరిగాయి. ఒడిశా రాష్ట్రం ఏర్పడక ముందు జరిగిన ఎన్నికల్లో ఒడిశాలో ముఖ్యమంత్రిని ప్రధానమంత్రిగా పిలిచేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికల నుంచి ముఖ్యమంత్రులుగా పిలిస్తున్నారు.

ముఖ్యమంత్రి పేరు	పదవీకాలం
కృష్ణచంద్ర గజపతి దేవ్	1937 ఏప్రిల్ 1 నుంచి 1937 జూలై 19
విశ్వనాథ్ దాస్	1937 జూలై 19 నుంచి 1939 నవరంబర్ 6
కృష్ణచంద్ర గజపతి	1941 నవంబర్ 24 నుంచి 1944 జూన్ 30
హరేకృష్ణ మెహతాబ్	1947 ఆగస్టు 15 నుంచి 1950 మే 12
నవకృష్ణ చౌదరి	1950 మే 12 నుంచి 1956 అక్టోబర్ 15
హరేకష్ణ మెహతాబ్	1956 అక్టోబర్ 15 నుంచి 1961 ఫిబ్రవరి 25
బిజయానంద పట్నాయిక్ (బిజూ పట్నాయిక్)	1961 జూన్ 28వ తేదీ నుంచి 1963 అక్టోబర్ 2
బిరేన్ మిత్ర	1963 అక్టోబర్ 2 నుంచి 1965 ఫిబ్రవరి 2
సదాశివ త్రిపాఠీ	1965 ఫిబ్రవరి 2 నుంచి 1967 మార్చి 8
రాజేంద్ర నారాయణ సింగ్‌దేవ్	1967 మార్చి 8 నుంచి 1971 జనవరి 11
విశ్వనాథ్ దాస్	1971 ఏప్రిల్ 3 నుంచి 1972 జూన్ 14
నందినీ శతపతి	1972 జూన్ 14 నుంచి 1973 మార్చి 3
నందినీ శతపతి	1973 మార్చి 6 నుంచి 1976 డిసెంబర్ 16
వినాయక ఆచార్య	1976 డిసెంబర్ 29 నుంచి 1977 జూన్ 25
నీలమణి రౌత్‌రాయ్	1977 జూన్ 25 నుంచి 1980 ఫిబ్రవరి 17
జానకీ వల్లభ పట్నాయిక్	1980 జూన్ 9 నుంచి 1989 డిసెంబర్ 7
హేమానంద బిశ్వాల్	1990 డిసెంబర్ 7 నుంచి 1990 మార్చి 5
బిజూ పట్నాయిక్	1990 ఫిబ్రవరి 5 నుంచి 1995 మార్చి 15
జానకీ వల్లభ పట్నాయిక్	1995 మార్చి 15 నుంచి 1999 ఫిబ్రవరి 15
డా.గిరిధర గొమాంగో	1999 ఫిబ్రవరి 15 నుంచి 1999 డిసెంబర్ 6
హేమానంద బిశ్వాల్	1999 డిసెంబర్ 6 నుంచి 2000 మార్చి 5
నవీన్ పట్నాయిక్	2000 మార్చ్ 5 నుంచి 2024 జూన్ 12
మోహన్ చరణ్ మఝి	2024 జూన్ 12 నుంచి ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు దుర్మరణం



రైలు పట్టాలపై పడివున్న యువకుడి మృతదేహం

జయపురం: రైలు ఢీకొనడంతో ఒక గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందాడు. అతడి వయసు సుమారు 30 ఏళ్లు ఉంటాయని, అతడి వివరాలు తెలియవని రైల్వే పోలీసు వర్గాలు వెల్లడించారు. మృతదేహాన్ని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అతడి బంధువులు వస్తే వారికి అప్పగిస్తామని, లేనిచో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అంత్యక్రియలు జరుపుతామని ఆ వర్గాలు వెల్లడించారు. గత రాత్రి జగదల్‌పూర్ – జయపురం రైలు మార్గంలో ధన్‌పూర్ స్టేషన్ సమీపంలో పట్టాలపై యువకుని మృతదేహం పడి ఉండడం చూసి సవారు రైల్వే అధికారులకు తెలియజేశారు. వెంటనే జీఆర్పీ టీమ్ రైల్వే రక్షణ విభాగ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతడు నల్లని ప్యాంట్, గల్ల షర్టు, నల్లని గావంచా ధరించి ఉన్నాడు. అలాగే చేతికి నల్లని దారం కట్టి ఉందని వెల్లడించారు. రైలు ఢీకొనడం వలన అతడి తలకు తీవ్ర గాయమైందని, మధ్యాహ్నం 12 గంటల వరకు మృతదేహం వద్ద పోలీసులు ఉండి పరిసర గ్రామాలకు కబురు చేశారు. ఆ యువకుడు ఈ ప్రాంతం వాడు కాదని, అతడు ఎవరో తెలియదని గ్రామస్తులు వెల్లడించటంతో మార్చురీకి తరలించారు.

చెరువులో మునిగి తల్లీకూతుళ్లు మృతి



చెరువు ఒడ్డున మృతదేహాల వద్ద రోదిస్తున్న గ్రామస్తులు

కొరాపుట్: చెరువులో మునిగి తల్లీకూతుళ్లు మృతి చెందిన విషాదకర ఘటన నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ సమితి చికిల్ పాదర్ గ్రామ పంచాయతీ పుజారి బరండి గ్రామంలో చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం గీతా కొలార్ (32), కుమార్తె (7) చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లారు. గీత చెరువు గట్టున పనిలో ఉండగా కుమార్తె ఆడుకుంటూ చెరువులోనికి వెళ్లిపోయింది. కుమార్తె మునిగిపోవడం చూసిన గీత వెంటనే రక్షించడానికి చెరువులోకి వెళ్లి, ఈత రాకపోవడంతో తాను కూడా మునిగిపోయింది. సుదూర పొలాల నుంచి చూసిన యువకులు వచ్చి చెరువులో గాలింపు చేపట్టారు. అప్పటికే వీరిద్దరూ మునిగిపోయారు. వీరిద్దరినీ గాలించి ఒడ్డుకు తెచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఉమ్మర్‌కోట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉమ్మర్‌కోట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన అందరినీ విషాదంలో నింపింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ప్రమాద స్థలంలో మనీష, పూర్ణచంద్రలు



మనీష (ఫైల్)



పూర్ణచంద్ర మృతదేహం

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి బాకురుగుడ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. స్కూటీపై వెళ్తున్న ఇద్దరిని ఎదురుగా వస్తున్న ట్యాంకర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ మణికేశ్వర్ కాలనీకి చెందిన మనీషా బెగొరాయ్ (25), కల్యాణ సింగుపూర్ సమితి పండ్రపడ గ్రామానికి చెందిన పూర్ణచంద్ర మహానందియా(29)లు మృతి చెందినట్లు గుర్తించామని చందిలి పోలీసులు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయిలోని హర్ష ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థలో మనీషా, పూర్ణ చంద్రలు పనిచేస్తున్నారు. తమ విధుల్లో భాగంగా గురువారం రాయగడకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి సికరపాయికి వెళ్తున్న సమయంలో బాకురుగుడ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సంఘటన స్థలంలో మనీష మృతి చెందగా, తీవ్రగాయాలకు గురైన పూర్ణచంద్రను స్థానిక ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

విఘ్నేశ్వరునికి వెండిమాల బహూకరణ


వెండి కమలం పువ్వుల మాలతో గణేషుడు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రం రాజువీధిలో ఉన్న గణేష్ దేవాలయంలోని మూల విగ్రహానికి వెండిమాల అలంకరించారు. ఈ దేవాలయం నిర్మాణం నుంచి బాగోగులు చూస్తున్న వేద పండితుడు గుప్త షడంగి దీనిని బహూకరించారు. బ్రహ్మపుర పట్టణంలో 1.2 కేజీలతో కమలం పువ్వులు తయారు చేసి మాలగా జత చేశారు. ఈ మాలని వేద పండితులు పూజార్చనల మధ్య గణేషుడికి అలంకరించారు.

ప్రమాదవశాత్తు హవాల్దార్ మృతి

భువనేశ్వర్: బాణాసంచా ధ్వంసం ప్రక్రియ చేపడుతుండగా ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో ఉన్న హవల్దార్ మృతి చెందాడు. ఈ విషాద సంఘటన కటక్‌లోని కఠాజొడి నది ఒడ్డున చోటుచేసుకుంది. పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణాసంచా ధ్వంసం చేస్తుండగా ప్రమాదం జరిగింది. మృతి చెందిన హవల్దార్ జగత్‌పూర్ ప్రాంతానికి చెందిన ప్రదీప్ మల్లిక్‌గా పేర్కొన్నారు. ప్రదీప్ మల్లిక్ 24 సంవత్సరాలుగా పోలీసు విభాగంలో పనిచేస్తున్నాడు. ఇటీవలే బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లో చేరాడు. స్వాధీనం చేసుకున్న బాణాసంచా ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో ఎస్సీబీ మెడికల్ కాలేజీ, ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ కాలిన గాయాలతో అతడు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకోవడానికి సైంటిఫిక్ బృందం సంఘటనా స్థలం సందర్శించిందని అదనపు డీసీపీ అనిల్ కుమార్ తెలిపారు. పేలిన పదార్థం బాంబు సంబంధితంగా భావిస్తున్నారు. ఈ కోణంలో అనుబంధ వర్గాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి.

సమ్మె చేపడతామని కార్మికుల హెచ్చరిక


సబ్ కలెక్టర్‌ను కలిసిన కార్మిక నేతలు

జయపురం: స్థానిక సేవా పేపరు మిల్లు యాజమాన్యం ఇచ్చిన హామీలు తుంగలో తొక్కడంతో ఈనెల 19వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సేవా పేపరు మిల్లు విశ్రాంత కార్మికులు హెచ్చరించారు. ఈ మేరకు కార్మిక సంఘ నేతలు జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడను కలిసి ఆందోళనపై లేఖ అందజేశారు. ఈనెల 8వ తేదీన అధికారులు, లేబర్, పోలీసు అధికారుల సమక్షంలో యాజమాన్య ప్రతినిధులు ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని లేఖలో ఆరోపించారు. విశ్రాంత కార్మికులకు రావాల్సిన పీఎఫ్, పెన్షన్, గ్రాచ్యుటీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సబ్ కలెక్టర్‌ను కలిసినవారిలో ప్రమోద్ కుమార్ మహంతి, వి.రవికుమార్, బసంత బెహర, సుదర్శన్ బిసాయి, ప్రహ్లాద్ మల్లిక్, జుధిష్టర్ స్వైం, కార్తీక మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


రైలుమార్గం పనుల పర్యవేక్షణలో జీఎంతో ఉన్నతాధికారులు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ పారాదీప్ ప్రాంతంలో కటక్ – పారాదీప్, పారాదీప్-హరిదాస్‌పూర్ రైల్వే సెక్షన్లు, ఇతర మౌలిక సదుపాయాలు సంబంధిత అభివృద్ధి పనులను పరిశీలించారు. రవాణా సౌకర్యం పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా వాటాదారులతో సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించడం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. తనిఖీ సమయంలో ఖుర్దా రోడ్ మండల రైల్వే అధికారి హెచ్.ఎస్.బజ్వా, జోనల్ కార్యాలయంలో ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులు పంపిణీ


పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నళిని

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్ట్ అనే సంస్థ శుక్రవారం ట్రస్ట్ కార్యాలయం వద్ద నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేసింది. బియ్యం, కందిపప్పు, బంగాళ దుంపలు, నూనె తదితరమైనవి 35 మంది నిరుపేదలైన ఆదివాసీ మహిళలకు అందించామని ట్రస్ట్ నిర్వాహకురాలు ఎం.నళిని తెలియజేశారు. ప్రతీ నెల తమ ట్రస్టు ద్వారా 35 మందికి ఇటువంటి తరహా నిత్యావసరాలను పంపిణీ చేస్తుంటామన్నారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ ఆచార్య ఆదేశానుసారం వచ్చే నెల నుంచి మరో ఐదుగురికి అదనంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నారు.

ఆనందోత్సాహాలతో ‘రొజ్జొ’

- రాష్ట్రవ్యాప్తంగా పండగ ఆరంభం
- జగన్నాథుని సన్నిధిలో ప్రత్యేక వేడుకలు
- మూడు రోజుల పాటు వేడుకలు


బనారస్ పాన్


రొజ్జొ ప్రసిద్ధ పిండి వంటకం పొడొ పిఠా


పాన్ విలాసం


నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులో వెలసిన ప్రత్యేక పాన్‌షాప్


శ్రీజగన్నాథునికి నివేదించే బిడియా పాన్


సంప్రదాయ రొజ్జొ పాన్


యువతుల అరచేత గోరింట ముచ్చట


చిన్నారుల ఊయలాట

భువనేశ్వర్: మూడు రోజుల రొజ్జొ పండుగ శుక్రవారం నుంచి ఆరంభమైంది. రాష్ట్ర ప్రజలు ఆటపాటలు, రుచికరమైన పిండి వంటకాల విందులతో అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. రొజ్జొ పండగని మిథున సంక్రాంతిగా వ్యవహరిస్తారు. పూరీ శ్రీజగన్నాథ దేవస్థానంలో ప్రత్యేక ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక తాంబూలం సమర్పిస్తారు. శ్రీజగన్నాథునికి నివేదించే తాంబూలం బిడియా పన్నొగా పేర్కొంటారు. ఈ రోజున భక్తులు విష్ణువు, భూదేవిని ప్రార్థించి పలు రకాల నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ పండగ సాగు పనులకు పుడమి తల్లి సంసిద్ధతకు సంకేతంగా జరుపుకోవడం విశేషం. రుతు పవనాల ఆగమనంతో తొలకరి జల్లుతో భూమి చల్లబడి వ్యవసాయ దిగుబడికి సిద్ధం అవుతున్నట్లు రొజ్జొ పండగ సభ్య సమాజానికి సరదా సంతోషాలతో నిగూఢమైన సందేశం ప్రసారం చేస్తుంది. భూదేవి ఆశీస్సులపై నమ్మకంతో రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకునేందుకు ఈ తిథి నుంచి నడుం బిగిస్తారు. వ్యవసాయ ఉత్పత్తులకు నేల అనుకూలతకు ప్రతీకగా పరిగణిస్తారు.

నవ యవ్వన ఉత్సాహం

రొజ్జొ ప్రధానంగా కౌమారం నుంచి పెండ్లి కావలసిన యుక్త వయసు యువతులు అత్యంత ఉత్సాహంగా జరుపుకునే పండగ. 3 రోజులు జరుపుకునే పండగగా యువతులు నిత్యం ఆకర్షణీయంగా అలంకరించుకుని స్వేచ్ఛగా ఆటపాటల్లో తలమునకలై ఉంటారు. అమ్మాయిలు చెట్ల కొమ్మలపై వేలాడదీసిన ఊయల మీద విపరీతంగా ఊగుతారు. ప్రేమ, వివాహం, కోరుకున్న వరుని కోసం ఇతివృత్తంగా పాటలు ఆలపిస్తూ తోటల్లో ఊయలలూగి మురిపెం పంచుకుంటారు. రొజ్జొ వేడుకలు పురస్కరించుకుని అమ్మాయిలకు దైనందిన ఇంటి పనుల నుంచి విరామం కల్పిస్తారు.

పిండి వంటలదే పైచేయి

బాలికలు, యువతులు ఆటపాటల్లో మునిగి తేలుతుండగా ఇల్లాలు ఇతర పెద్ద వయసు మహిళలు ఇంటిల్లపాది కోసం రుచికరమైన సంప్రదాయ పిండి వంటకాల తయారీలో హడావిడిగా ఉంటారు. ఆటపాటలు, పిండి వంటలు ఒక ఎత్తైతే రొజ్జొ వేడుకల్లో రుచికరమైన తాంబూలం (కిల్లీ) సేవించడం మరో ఎత్తు. తాంబూల సేవన లేకుంటే రొజ్జొ పండుగ అసంపూర్ణమే. రొజ్జొ మూడు రోజుల వేడుకల్లో కిల్లీ తినడం సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా స్పష్టం అవుతుంది. తాంబూలం శ్రీమహాలక్ష్మికి ప్రీతికరమైన నైవేద్యం కావడం వేడుకల్లో అంతర్భాగంగా పేర్కొంటారు.

బనారస్ పాన్‌కు గిరాకీ

బనారసి పాన్ అత్యంత విలాసవంతమైనది. పండగ సందర్భంగా మాత్రమే ఈ పాన్ లభించడం విశేషం. కటక్ మహా నగరంలో 64 రకాల దినుసులతో బనారసి పాన్ విక్రయిస్తున్న రోహిత్ బనారసి పాన్ స్టాల్ హాట్‌స్పాట్‌గా మారింది. ఈ దుకాణంలో పలు రకాల పాన్ కొనుగోలు కోసం జనాలు గుమిగూడుతున్నారు. రొజ్జొ ప్రత్యేక పాన్ ధర రూ.30 నుంచి రూ.70 వరకు ఉంది.

సంప్రదాయ ఆటపాటలు

సంప్రదాయ ఆటపాటలతో రొజ్జొ పండగ ఆబాల గోపాలాన్ని ఆనందోత్సాహాల్లో ముంచెత్తుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన పుచ్చీ ఖెలొ రొజ్జొ పండగలో అన్ని వయసు వర్గాల మహిళలు పోటాపోటీగా ఆడతారు. కొత్త బట్టలు ఆకర్షణీయమైన అలంకరణతో అరచేత గోరింట వన్నెలు మరో ముచ్చటగా యువతులు తీర్చిదిద్దుకుంటారు.

కొరాపుట్: ఉత్కళ మహిళల సాంప్రదాయ పండగ రొజ్జొ ఘనంగా ప్రారంభమైంది. దీంతో కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. ప్రత్యేకంగా మిఠాయి, పాన్ దుకాణాలు వెలిశాయి. పలుచోట్ల మహిళలు ఊయలలు ఊగుతూ కనిపించారు. సామూహికంగా సాంప్రదాయ నృత్యాలు చేస్తూ సంతోషంగా గడిపారు. సామూహిక విందులు జరిగాయి.

ప్రముఖుల శుభాకాంక్షలు

శుక్రవారం ప్రారంభమైన రొజ్జొ పండుగ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఒడిశా ప్రజలు ఈ పండుగను మిఠాయిలు, కేకులు, పాన్‌లతో జరుపుకోవడం ఆచారమని ఆమె అభినందించారు. వ్యవసాయ పండుగ రొజ్జొ సందర్భంగా రాష్ట్ర, దేశ ప్రజలకు సుఖ సంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్రపతితో పాటు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రొజ్జొ పండుగ సందర్భంగా ఒడియా ప్రజలకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. రొజ్జొ పండగ ప్రకృతిని, దేవతలను, స్త్రీలను ఆరాధించడం, గౌరవించే ఉన్నత సంప్రదాయం సభ్య సమాజానికి చవి చూపించే పండగగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుభాకాంక్షల్లో పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


జయపురం: ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్


మల్కన్‌గిరి: ర్యాలీలో పాల్గొన్న వైద్యులు


రాయగడ: రక్తదానం చేస్తున్న కలెక్టర్ మహాజన్


మల్కన్‌గిరి: రక్తదానం చేస్తున్న దాతలు


మల్కన్‌గిరి: డొనేట్ బ్లడ్ సేవ్ లైఫ్ ముగ్గును వేస్తున్న నర్సులు

రాయగడ: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర సమావేశ మందిరంలో జిల్లా ఆరోగ్య శాఖ, మార్వాడీ యువ మంచ్, ఆమో ఒడిశా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు పోగొట్టేందుకు వివిధ చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. శిబిరంలో 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా స్థానిక పాత మెడికల్ నుంచి భారీ ర్యాలీని జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నందో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెద్భార్ ప్రధాన్ మాట్లాడుతూ రక్తదాతలే ప్రాణదాతలన్నారు. 18 ఏళ్లు నిండిన యువత రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి బ్రజోదాస్, బ్లడ్ బ్యాంక్ వైద్యుడు సాగార్ బాల, వైద్యుడు సోపాన్‌కుమార్ డిండా, బీఎస్‌ఎఫ్ డిప్యూటీ కామాండర్ శుభరంజాన్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

జయపురం: రక్తదానం మహత్తరమైనదని స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రి చిల్డ్రన్స్ స్పెషలిస్టు డాక్టర్ దుర్గాప్రసాద్ పాత్రో అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన సచేతన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం రక్త దాతలను సన్మానించారు. కార్యక్రమంలో జయపురం సబ్ డివిజన్ రక్తదాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌళో, సమాజసేవి నిరంజన్ పట్నాయిక్, బాబా భజరంగ్, జిల్లా కేంద్ర ఆస్పత్రి మేనేజర్ మధుస్మిత రూపసి నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

మునిషిపాదొరొలో ఎమ్మెల్యే కద్రక పర్యటన


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కద్రక

రాయగడ: జ్వరాలతో సతమతమవుతున్న జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని మునిషిపాదొరొలో రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక శుక్రవారం పర్యటించారు. జ్వరాలతో ఈ గ్రామంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందిన సంఘటన తెలిసిందే. మరికొంత మంది స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితిని తెలుసుకునేందుకు ఎమ్మెల్యే కద్రక ఆ గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా కొంత మొత్తం ఆర్థిక సహకారాన్ని అందించారు. అనంతరం గ్రామంలో రోగాలు ప్రబలకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని తెలియజేశారు. ఇదిలా ఉండగా వైద్యశాఖలో అవసరమైన డాక్టర్ల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

కార్యదర్శులతో సీఎం సమావేశం


కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్ చరణ్

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శుక్రవారం కార్యదర్శులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పనులను సమీక్షించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా పాల్గొన్నారు. ఇది ముఖ్యమంత్రి తొలి సమావేశం కావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర కార్యాచరణకు సంబంధించి వీరితో చర్చించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా, అభివృద్ధి కమిషనర్ అనుగార్గ్, ఆర్థిక శాఖ కార్యదర్శి విశాల్ దేవ్, వ్యవసాయ శాఖ కార్యదర్శి అరబింద కుమార్ పాఢి, మత్స్య, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ వశిష్ఠ, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ఆర్థిక స్థితి, సవాళ్లకు సంబంధించిన సవివరమైన సమాచారం ప్రధాన కార్యదర్శి ప్రదర్శించారు. సమావేశానంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది తొలి అధికారిక సమావేశమన్నారు. ఒడిశా ప్రస్తుత పరిస్థితిపై మేము సమగ్ర సమాచారం వివారలతో ప్రదర్శించాము. ప్రదర్శనలో భాగంగా రాష్ట్ర జనాభా, భౌగోళిక పరిస్థితి, ఆర్థిక వ్యవస్థ మరియు సంభావ్య సవాళ్లను తెలియజేసినట్లు పేర్కొన్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో ఇలాంటి రెండు మూడు సమావేశాలు జరుగుతాయని చీఫ్ సెక్రటరీ తెలిపారు.

దుస్తులు కుట్టే కేంద్రం ప్రారంభం


భవనం ప్రారంభిస్తున్న అధికారులు

జయపురం: సబ్ డివిజన్ కోట్‌పాడ్‌లో బుధవారం సాయంత్రం మిషన్ శక్తి దుస్తులు కుట్టే కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఈ తయారీ శిక్షణ కేంద్రం నిర్మాణానికి హిందూస్థాన్ ఏరోనాటిక్ లిమిటెడ్ కొరాపుట్ డివిజన్ రూ.2.5 కోట్ల సహకారం అందించిందని, అలాగే దుస్తులు తయారీ కోసం కుట్టు మిషన్‌లు అవసరమైన పరికరాలకు కోటీన్నర సమకూర్చిందని అధికారులు వెల్లడించారు. ఈ కేంద్రంలో 69 అధునాతన కుట్టు మిషన్‌లు ఉన్నాయని, విద్యార్థులకు దుస్తులు ఈ కేంద్రంలో తయారు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రంలో మహిళలు దుస్తులు తయారు చేసే శిక్షణ పొందగలరని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బ్రాడ్‌కాస్టింగ్ మంత్రాలయ డిప్యూటీ సెక్రటరీ సంకేష్ మోహంగా, కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు పెద్దపీట


అనాథ బాలికలతో నబరంగ్‌పూర్ కలెక్టర్ కమలోచన్ మిశ్ర

- నబరంగ్‌పూర్ కలెక్టర్ కమలోచన్ మిశ్ర


బాలికలకు నూతన వస్త్రాలు, మిఠాయిలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లాలో బాలికల సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని మజ్జిగుడలో పండిట్ దీన్ దయాల్ బాలికల అనాథ ఆశ్రమాన్ని శుక్రవారం సందర్శించారు. ఉత్కళ మహిళలు ఆనందంగా గడిపే రజ్జో సంక్రాంతిని బాలికలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. పదో తరగతి పాసైన బాలికలు వృత్తి విద్యాకోర్సులో చేరాలని సూచించారు. వారి చదువుకి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తుందని హామీ ఇచ్చారు. సమాజంలో ఒంటరి వాళ్లం అనే భావన పోవాలంటే చదువు ఒక్కటే ప్రధాన ఆయుధమన్నారు. అనంతరం బాలికలకు నూతన వస్త్రాలు, మిఠాయిలు పంచి పెట్టారు. కలెక్టర్ తమను తండ్రిలా చూడడంతో బాలికలు కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో జిల్లా బాలికా సంరక్షణ అధికారి సురేష్ పట్నాయక్, ప్రత్యేక దత్తత సంరక్షణ మేనేజర్ సాగర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెంచూరియన్‌లో మెడికల్ కోడింగ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయం లో పారా మెడికల్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ ప్రశాంత కుమార్ మహంతి ఆన్‌లైన్‌లో ఈ సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మా ఇండస్ట్రీలో మెడికల్ కోడింగ్ నేర్చుకునే వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ వ్యాధులను నిర్ధారించేటప్పుడు కోడింగ్ ఇస్తారని, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కోడింగ్ నేర్చుకుంటే సాఫ్ట్‌వేర్ మాదిరిగా అత్యధిక వేతనాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

కూలిన 17 విద్యుత్ స్తంభాలు



పెదమానాపురం సంత వద్ద కోళ్లఫారం వెనుక కూలిన విద్యుత్ స్తంభం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి 17 విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు ఏఈ ఆదిత్య తెలిపారు. కోమటిపల్లి, పెదమానాపేరం, ఇంగిలాపల్లి వంగర గ్రామాలతో పాటు కోమటిపల్లి-దత్తిరాజేరు రోడ్డులో బీటీ రోడ్డును ఆనుకుని ఉన్న స్తంభాలు, జాతీయ దారికి ఇరువైపులా కొన్ని స్తంభాలు కూలిపోయాయని వాటిని శనివారం సాయంత్రానికి పునరుద్ధరించనున్నామని తెలియజేశారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కా ర్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెం శ్రీనివాస కళాశాల సమీపంలో సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి కేబుల్ వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై స్థానికులందించిన సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కొంతకాలంగా మతిస్థిమితం లేక పరిసర ప్రాంతాల్లో ఈ వ్యక్తి తిరుగుతున్నాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. మృతుడి శరీరంపై కుమారి అనే పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని పోలీస్ సిబ్బంది కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహారాజా కేంద్రాస్పత్రికి తరలించారు.

పిడుగు పడి ఎద్దు మృతి



ఎద్దు కళేబరాన్ని ఖననం చేసేందుకు తీసుకువెళ్తున్న బాధితులు

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామానికి చెందిన కోడి దుర్గారావు దుక్కిటెద్దు శుక్రవారం పిడుగు పడి మృతి చెందింది. పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కళ్లం వద్ద ఎద్దులను విడిగా కట్టి ఇంటికి చేరుకున్నానని, అనంతరం భారీ ఎత్తున పిడుగులతో కూడిన వర్షం కురవడంతో ఆందోళన చెంది కళ్లం వద్దకు వెళ్లి చూడగా ఓ ఎద్దు మరణించినట్లు గుర్తించామన్నారు. రూ.లక్ష 50వేల పైబడి ఈ ఎద్దుల జత ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

పోషకాలతోనే పశుసంపద వృద్ధి

- పశుసంవర్ధక శాఖాధికారుల సూచన



పాడిపశువులకు గడ్డి వేస్తున్న రైతు

రామభద్రపురం: పోషకాలతోనే పశుసంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు, విటమిన్లు, నీరు అవసరముంటాయని పశుసంవర్ధక శాఖాధికారులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా వారు సూచించిన వివరాలు వారి మాటల్లో..

మాంసకృత్తులు..

శరీర నిర్మాణానికి, పెరుగుదలకు, రోగ నిరోధకశక్తికి, హిమోగ్లోబిన్ రవాణాకు తోడ్పడతాయి.శరీరానికి శక్తిని సరఫరా చేస్తాయి. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడిపశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు బక్కచిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయాలు చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్తవయసుకు రావడం, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరిపిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి, మాంసంపొడి వంటి ముడిపదార్థాలు పప్పుజాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

పిండిపదార్థాలు..

శరీరంలో కొవ్వునిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంస కృత్తులకంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైనది. కొవ్వు, పిండిపదార్థాల కన్నా రెండున్నర రెట్లు అధిక శక్తినిస్తాయి.ఒక గ్రాము కొవ్వుపదార్థం సుమారు 9కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని ప్రసాదిస్తాయి.వేరుశనగపిండి, కొబ్బరిపిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడు లాంటి పదార్థాల్లో కొవ్వుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

నీరు..

మేత లేకుండా పశువులు మూడు నెలలపాటు బతకగలిగినా నీరు లేకుండా ఐదురోజులకు మించి బతకలేవు.నీరు శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు ఎంతోగానో ఉపయోగపడుతుంది.నీరు ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు,విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాసప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థపదార్థాల విసర్జనక్రియలో దోహదపడుతుంది. శరీరంలోని మాంసపుకృత్తులు, కొవ్వుపదార్థాలు, పిండిపదార్థాల ఆక్సీడేషన్ వల్ల కూడా అరలీటర్ నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషకపదార్థం తరపున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడవు. పశువులు డీహైడ్రేషన్‌కు గురై మరణిస్తాయి.కాబట్టి నీరు కూడా పశువులకు అత్యవసరమయ్యే పోషక పదార్థాల్లో ఒకటిగా గుర్తించాలి. పశువులు తాగేందుకు రోజుకు 50-60 లీటర్లు నీరు అవసరం.



గొర్రెల మందను మేతకు తోలుతున్న కాపరి

వానాకాలంలో జాగ్రత్తలు..

వర్షాకాలంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే చిటిక వ్యాధి, నీలి నాలుక వ్యాధి, పారుడు, కాళ్ల డెక్కల వ్యాధి, శ్వాసకోశ వ్యాధి వంటివి సోకే ప్రమాదం ఉంది. గొర్రెలు, మేకలను వర్షం బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేసి వాటికి న్యుమోనియా వ్యాధి సోకకుండా కాపాడుకోవాలి.వ్యాధి సోకిన వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి.వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. అలాగే ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. వ్యాధి నుంచి కోలుకున్న తర్వాత మాత్రమే మందలో కలపాలి. ఒక వేళ గొర్రె లేదా మేక మృతి చెందితే వాటి కళేళాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి లోతుగా గొయ్యి తవ్వి పూడ్చి పెట్టాలి.చనిపోయిన జీవి తినగా మిగిలిన గడ్డిని కూడా కాల్చివేయాలి. నీటి పాత్రలను క్రిమిసంహారక మందులతో శుభ్రం చేసి ఎండలో ఆరబెట్టాలి.అలా జాగ్రత్తలు పాటిస్తే గొర్రెలు, మేకలను కాపాడుకోవచ్చు.మూగ జీవాలకు ఏ వ్యాధి సోకినా వెంటనే దగ్గరలో ఉన్న పశువైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించడంతో పాటు అక్కడి పశువైద్యాధికారి సలహాలు,సూచనలు పాటించాలి.



ఎల్ విష్ణు, ఎ.డి, పశుసంవర్ధకశాఖ బొబ్బిలి

విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్‌లు అందాలి

- స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పన



అక్కివరం పంచాయతీ పరిధిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ స్టూడెంట్ కిట్‌లను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు కల్పన

డెంకాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్‌లు అందేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, స్టూడెంట్ కిట్‌ల పంపిణీ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన అన్నారు. ఈ మేరకు మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలో ఉన్న ఏపీ మోడల్‌స్కూల్‌లో జరుగుతున్న స్టూడెంట్ కిట్లను, పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. మండలంలో ఉన్న 67 పాఠశాలలకు స్టూడెంట్ కిట్‌లను మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పంపిణీ చేశారు. దీనిని పరిశీలించిన రాష్ట్ర పరిశీలకురాలు కల్పన విద్యార్థులకు అందించే స్టూడెంట్ కిట్ నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించేందుకు ఆయా పాఠశాలలకు కిట్‌లను పంపిణీ చేసిన తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన స్టాక్, పంపిణీ చేసిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంవో ఆదినారాయణ, ఎంఈవో-2 వి.శ్రీరామ్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్ పోటీల్లో సత్తా చాటాలి



శిక్షణ ముగించి వచ్చిన లోకేష్‌ను అభినందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

తెర్లాం: స్పెషల్ ఒలిపింక్ భారత్ క్రీడల పోటీల్లో తెర్లాం హైస్కూల్ తరపున పాల్గొననున్న క్రీడాకారుడు సత్తా చాటి రాష్ట్రస్థాయిలో పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు, స్థానిక హైస్కూల్ హెచ్ఎం రమేష్ కోరారు. స్పెషల్ ఒలింపిక్ భారత్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులకు ఈ నెల 7 నుంచి 11 వరకు అనంతపురంలోను, వైఎస్సార్ కడప జిల్లా గండికోటలో గల అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు తెర్లాం హైస్కూల్ నుంచి ప్రత్యేక ఉపాధ్యాయుడు సునీల్, తొమ్మిదో తరగతి విద్యార్థి లోకేష్ హాజరయ్యారు. శిక్షణ ముగించుకుని వచ్చిన వారిని అభినందించే కార్యక్రమాన్ని పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ, హెచ్ఎంలు మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్పెషల్ ఒలింపిక్ భారత్ పోటీల్లో లోకేష్ ప్రతిభ కనబరచాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఐఈఆర్‌టీ తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు చోరీ కేసు నిందితుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు

గజపతినగరం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న బి.తిరుపతి రావు (మెయిన్ రోడ్డులో సిమ్మెంట్, ఐరన్ వ్యాపారి) ఇటీవల చోరీ జరగడంతో బాధితుడు పోగొట్టుకున్న బంగారం, నగదును తక్కువ సమయంలోనే రికవరీ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. బాధితుడు తిరుపతి రావు ఈనెల 7వ తేదీన భార్యతో కలిసి పూరీ తీర్థయాత్రకు బయల్దేరాడు. అదే రోజు రాత్రి వారి ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించిన బాధితుడి మేనమామ తిరుపతి రావుకు ఫోన్ చేసి విషయం చెప్పి రప్పించాడు. ఫోన్ సమాచారం మేరకు తిరుపతిరావు హుటాహుటిన వచ్చి పరిశీలించేచి ఇంట్లో దాచుకున్న బంగారం, రూ.లక్ష నగదు పోయినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీస్ సిబ్బందితో పాటు సీఐ ఎస్‌వీ ప్రభాకరరావు, ఎస్సై యు.మహేష్‌లు సంఘటనా స్థలానికి వచ్చి ఫింగర్ ప్రింట్స్ సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టి చోరీ కేసులో నిందితుడిగా మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన పిల్లా సత్తిబాబును గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడు పోగొట్టుకున్న నగదు రూ.80వేలు, 14.5 తులాల బంగారం నిందితుడి దగ్గర నుంచి రికవరీ చేశారు. నిందితుడు దొంగతనానికి ఉపయోగించిన పనిముట్లు, ఓ బైక్‌ను సీజ్ చేశారు. సమావేశంలో సీఐ ప్రభాకరరావు, ఎస్సై యు.మహేష్‌లతో పాటు సిబ్బంది గోపి, సత్యనారాయణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



రక్తదానంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు మాత్రమే కాకుండా సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం వంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని డీఎంహెచ్‌ఓ డా.ఎస్ భాస్కరరావు అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం, చేగువేరా జయంతి సందర్భంగా సీఐటీయూ, మెడికల్ రిప్స్ యూనియన్ ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంకులో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్.ఎస్ భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్.బి.గౌరీశంకర్, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.సుబ్రహ్మణ్యం, ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి శంకరరావు , కె.సురేష్ ,జిల్లా ఉపాధ్యక్షుడు జి.అప్పలసూరి, ఎం శ్రీనివాస, ఎ.గౌరీ నాయుడు, నగర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్ రావు, నగర ఉపాధ్యక్షుడు ఆర్ శంకర్రావు, మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీను, కోశాధికారి డీఎల్‌ఏ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ పరిష్కరించనున్నామన్నారు. న్యాయవాదులంతా లోక్‌అదాలత్‌కు సహకరించి వీలైనన్ని కేసులను పరిష్కరించుకోవాలని, అలాగే ఈ అవకాశాన్ని కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయి తేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రావినాయుడు, ఉపాధ్యక్షులు ఆర్ఈసీహెచ్ జయదేవ్, ఏజీపీ ఎస్.పోలారావు, ఎం.శ్రీనివాసరావు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జామియా మసీదు అభివృద్ధికి కృషి



జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్.జాన్‌ను సత్కరిస్తున్న శ్రీకాకుళం జమియా మసీదు కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: శ్రీకాకుళంలోని జామియా మసీదు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు విజయనగరం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్.జాన్ పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మనిజీర్ జిలానీ సమూన్ ఆదేశాలతో మసీదు కమిటీ అధ్యక్ష్యుడు మహిబుల్లాఖాన్‌తో కలిసి శుక్రవారం జామియా మసీదును సందర్శించి, సమస్యలపై ఆరాతీశామని జాన్ తెలిపారు. త్వరలోనే అభివృద్ధికి సంబంధించిన పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ ప్రతినిధులు ఆయనను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మసీదు గౌరవాధ్యక్షుడు అమిరుల్లాబేగ్, సలీమ్లాఖాన్, ఉపాధ్యక్షులు సర్ఫరాజ్, కార్యదర్శి అక్బర్‌షా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు షుక్రుఖాన్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి ఒకరి మృతి



సీతారాం మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



గాయపడిన వెంకటనాయుడిని 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి మద్దివలస గ్రామ సమీపంలో పిడుగుపడి గ్రామానికి చెందిన వీరపిండి సీతారాం (33) మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన ఉత్తరావెల్లి వెంకటనాయుడు గాయపడి అస్వస్థతకు గురయ్యాడు. గ్రామ సమీపంలో ఉన్న మడ్డువలస రిజర్వాయర్ పరిసర ప్రాంతాలకు వారి పశువులను ఎప్పటిలాగానే ఉదయం సమయంలో మేతకు తీసుకువెళ్లారు. సాయంత్రం వాటిని తీసుకువచ్చేందుకు సీతారాం, వెంకటనాయుడుతోపాటు చిన్ని రమణ వెళ్లారు. గ్రామానికి కొంత దూరంలో ఉన్న నీలకోనేరు సమీపంలోకి వెళ్లే సరికి ఒక్కసారిగా వాతావరణం మార్పుచెంది మెరుస్తుండడాన్ని గమనించి వెనక్కి వచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఈ ముగ్గురు ఒకరి వెనుక ఒకరు వస్తుండగా ముందుగా నడుస్తున్న వీరపిండి శంకరరావుపై అగ్నిపిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక నడుస్తున్న ఉత్తరావెల్లి వెంకటనాయుడు గాయపడి అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న చిన్ని రమణ వారిని చూసి కేకలు వేశాడు. ఇదే దారిలో పశువులను తెచ్చేందుకు వెళ్తున్న మరికొందరి వారిని గ్రామానికి చేర్చారు. వెంకటనాయుడును తొలుత వంగర పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి రెండేళ్ల క్రితం లావణ్యతో వివాహం కాగా ఏడాది వయసున్న కుమారుడు వీరన్నాయుడు ఉన్నాడు. మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు భోరున విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ పిల్ల సన్యాసినాయుడు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి..



రామారావు మృతదేహం

గంట్యాడ: మండలంలోని పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన కొంచాడ రామారావు(28) విజయనగరంలో పనిముగించుకుని ద్విచక్రవాహనంపై పెదమజ్జిపాలెం వెళ్తుండగా నరవ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న వెంటనే రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సురేంద్ర నాయుడులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులను ఆరా తీసారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండర్-19 చెస్ క్రీడాకారుల ఎంపిక రేపు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 16న జిల్లా స్థాయిలో అండర్-19 క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నగరంలోని ఫైర్ చెస్ స్కూల్ ఆవరణలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 2005 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు అబ్బాయిలను, నలుగురు అమ్మాయిలను త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి పంపించనున్నట్లు చెప్పారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఫోన్ 9703344488 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భార్య టీడీపీ.. నేను వైఎస్సార్‌సీపీలోనే...

- మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు
- అన్యాయంగా ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించారు
- న్యాయం కోసం పోరాటం చేస్తా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విజయనగరం: భార్య టీడీపీలో చేరితే తనను ఎమ్మెల్సీ పదవిలో నుంచి తొలగించడం అన్యాయమని ఇందుకూరి రఘురాజు అన్నారు. ఏ తప్పు చేయకున్నా శాసనమండలి చైర్మన్ తనను అన్యాయంగా పదవీచ్యుతుడిని చేశారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు. విజయనగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముందు రోజు నాలుగో నోటీసు ఇచ్చి డిస్మిస్ చేశారని, గతంలో మూడు నోటీసులు వచ్చిన సందర్భంలో పార్టీ మీద వ్యతిరేకంగా మాట్లాడకూడదని ముందుగా స్పందించలేదన్నారు. షెడ్యూల్ 10 కింద డిస్మిస్ చేసినట్టు నోటీసులు ఇచ్చారని, పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం నేనేమీ పార్టీకి వ్యతిరేకంగా పని చేయలేదన్నారు. ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేసిన వ్యవహారాలు నచ్చక పోవడంతో పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. తను ఏ పార్టీలో చేరలేదని, ఏ పార్టీ కోసం పని చేయలేదన్నారు. భార్య ఇందుకూరి సుబ్బలక్ష్మి (సుధారాజు) టీడీపీలో చేరారని, టీడీపీ వాళ్లతో నేను టచ్‌లో ఉన్నానని కారణాలు చూపి సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. నోటీసులు జారీ చేసిన సమయంలో కొన్ని కారణాల వల్ల హాజరుకాలేక సమయం కోరినప్పటికీ తనకు అవకాశం ఇవ్వలేదన్నారు. తనకు పదవులు అంటే ఆసక్తి లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనను పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, ఇప్పటికీ తను వైఎస్సార్‌సీపీలోనే ఉన్నట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమి తనను బాధించిందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఎస్.కోట నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేశానని చెప్పారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

నరసన్నపేట: జాతీయ రహదారిపై మడపాం టోల్‌గేట్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో పోలాకికి చెందిన వి.విజయ దుర్గారావుకు తీవ్ర గాయమైంది. మిగిలిన ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స చేసి పంపారు. విశాఖ వన్ డిపోకు చెందిన ఈ ఆర్టీసీ బస్సు విశాఖ నుంచి ఇచ్ఛాపురం వెళ్తోంది. మడపాం టోల్‌గేట్ వద్దకు వచ్చే సరికి బస్ ముందు టైర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి టోల్‌గేట్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 32 మందితో పాటు డ్రైవర్‌కమ్ కండక్టర్ రవికుమార్ ఉన్నా రు. బస్సు ముందు భాగం దెబ్బతింది.

రైలు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో శుక్రవారం జరిగిన రైలు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి చెందినట్లు జీఆర్‌పీలు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక రైలు నిలయం సమీపంలో ఎర్రచెరువు వద్ద బరంపురం వైపు వెళ్లే డౌన్ ట్రాక్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో ఒడిశాలోని నువగాం, రామచంద్ర ఖజూరియా గ్రామానికి చెందిన రౌళోసాహి (45) అనే వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ సిబ్బంది గుర్తించారు.

మృతుడు రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం సంభవించి ఉంటుందని జీఆర్‌పీలు తెలిపారు. పూర్తివివరాలు సేకరించిన ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.